పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

పోలింగ్ కేంద్రాలు అన్ని సౌకర్యాలు కలిగి ఉండాలని ఎస్ఐ పి.వాసు, ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, రెవెన్యూ అధికారి వి.కుమారిలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి, సూరేపల్లి, అక్కిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

కాలువ గట్టుపై మాయమైన మట్టి

గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట.. గట్టు గుటకాయస్వాహా..!

చింతలపూడి ఎత్తిపోతల కాల్వగట్టుపై యథేచ్ఛగా తవ్వకాలు

కొండలు, గుట్టలు సైతం మాయం - పట్టించుకోని అధికారులు

స్థానిక అవసరాలకు తవ్వితే కేసులు - లబోదిబోమంటున్న ప్రజలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో మండలంలో ఎక్కడబడితే అక్కడ అడ్డూఅదుపు లేకుండా కాంట్రాక్టర్లు యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ మట్టిని తరలిస్తున్నారు. హైవే రోడ్డు నిర్మాణం పేరుతో కొండలను పిండి చేస్తున్నారు. గుట్టలను తొలిచేస్తున్నారు. అవి చాలదన్నట్టు చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టిని ఏకంగా నెల రోజుల్లో మాయం చేశారు. ఇదేమని స్థానికులు అడిగితే అనుమతులున్నాయని చెబుతుండటం గమనార్హం. కాలువ గట్టు మట్టి తవ్వకం, తరలింపునకు అనుమతులు ఇస్తారా, ఇస్తే ఎవరిచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలతోపాటు చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టి తవ్వకాలు చేయడం వల్ల స్థానిక అవసరాలకు రానున్న రోజుల్లో మట్టి దొరికే పరిస్థితి లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలోని ముత్యాలమ్మపేట నుండి టి.నరసాపురం సమీపం నుండి బొర్రంపాలెం మీదుగా జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ హైవే నిర్మాణానికి మట్టి తవ్వకాలకు జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారంటూ గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్లు జెసిబీలతో కొండలు, గుట్టలు, చెరువులు ఇలా ఒకటేమిటి, ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు సాగించేశారు. ఇప్పుడు ఏకంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టి కూడా తవ్వేస్తున్నారు. దీంతో క్రమంగా గట్టు మాయమవుతోంది. ఇలా తవ్వకాలు చేస్తూ పోతే చివరకు గ్రామాల్లో ఇంటి అవసరాలకు మట్టి దొరికే అవకాశం ఉండదని పలువురు వాపోతున్నారు.

స్థానికులు తవ్వితే కేసులు.. కాంట్రాక్టర్లకు అనుమతులు..!

ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం తవ్వకాలు చేస్తున్న కొండలు, గుట్టలు, చెరువుల్లో స్థానికులు ఇంటి అవసరాలకు పునాదిలోకి, స్థలం అభివృద్ధికి మట్టి తోలుకుంటే వారిపై అధికారులు కేసులు పెట్టేవారని, ఇప్పుడు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టి తవ్వేస్తే ఎలాగని, దీనికి అనుమతులు ఎలా ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలు నివారించాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా మట్టి దొరికే విధంగా చూడాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఎక్కడో ఒకచోట మాత్రమే అనుమతులు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

దర్జాగా సాగుతున్న గట్టు తవ్వకం, తరలింపు

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతపై శనివారం అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితరాలు పూర్తిస్థాయిలో చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణపై తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాల్లో ప్రాథమిక శిక్షణ అందించామని, నెలాఖరులోగా పూర్తి స్థాయిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. జిల్లాలోని 1191 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని మారుమూల గ్రామాలైన వేలేరుపాడు, గెడ్డపల్లి వంటి గ్రామాలకు వాహనాల ద్వారా పోలింగ్ సిబ్బంది, సామగ్రి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్నింటిలోనూ విద్యుత్, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం వంటి కనీస ప్రాథమిక వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో నియమావళి ఉల్లంఘన అంశాలను పరిశీలించేందుకు 502 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, అవసరమైతే మరింతమందిని నియమిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో భద్రతా ఏర్పాట్లకు 9874 మంది పోలీసు సిబ్బంది అవసరమని, దీనికి జిల్లా ఎస్‌పితో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ, డిఆర్‌ఒ పుష్పమణి, ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, అద్దయ్య, భవానిశంకరి పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఆర్‌టిసి సిబ్బంది

ఆర్‌టిసి కార్మికుల రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు రీజనల్ మేనేజర్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ రక్తాన్ని సేకరించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం వల్ల ముగ్గురికి ప్రాణదానం జరుగుతుందని, మూడు నెలలకోసారి ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానం చేయచ్చని అన్నారు. గత సంవత్సరం వంద మంది రక్తదానం చేశారని, ఈ సంవత్సరం కూడా ఎక్కువ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతి వారం రక్తాన్ని అందిస్తున్నామన్నారు. గర్భిణులకు, ప్రమాద సమయంలో అధిక రక్తస్రావం జరిగే రోగులకు రక్తం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, నూజివీడు డిపో మేనేజర్ సిహెచ్.పవన్ కుమార్, ఎఎంటి జి.మురళి, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ ఐ.ప్రేమ్‌కుమార్, ఆర్‌టిసి మెడికల్ ఆఫీసర్ బి.భాను, పిఆర్‌ఒ కెఎల్‌వి.నరసింహం పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుండి వంద మందికిపైగా కార్మికులు రక్తదానం చేశారు.

మెగా డిఎస్‌సి కోరుతూ 12న చలో కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఏలూరులో జరిగింది. సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఠాగూర్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచి, నోటిఫికేషన్ సమయం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. 117 జిఒ రద్దు చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి విడుదల చేసి అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సిద్ధపడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, రోహిత, రాజీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ మంచి పౌష్టికాహారం తీసుకున్నట్లయితే సుఖ ప్రసవాలు జరిగి ఆరోగ్యకరమైన బిడ్డలు పుట్టే అవకాశం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తపేటలో జరుగుచున్న ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం (పిఎంఎస్‌ఎంఎ)లో పాల్గొన్న గర్భిణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు తగ్గించుట, సాధారణ ప్రసవాలు ప్రోత్సహించుట ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతినెల 9, 10 తేదీల్లో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, అక్కడ ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత రక్త పరీక్షలు, ఉచిత మందులు, ఉచిత వైద్య సలహాలు, గర్భధార సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, బరువు తక్కువ ఉన్న గర్భిణులకు పౌష్టికాహార సలహాలు, ప్రమాదకర స్థాయి గర్భిణులను గుర్తించి ప్రత్యేక సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలు అందించే పౌష్టికాహారం క్రమ తప్పకుండా తీసుకోవాలని, తద్వారా బిడ్డ బరువు పెరిగి ఆరోగ్యకరమైన బిడ్డను జన్మనివ్వచ్చని సూచించారు. గర్భిణులు జ్వరాల బారిన పడకుండా, దోమ కాటు నుంచి తమని తాము రక్షించుకోవాలని, దోమల పట్ల అజాగ్రత్తగా ఉండరాదని తెలిపారు. అనంతరం స్థానిక కొత్తపేట గాంధీ నగర్ అంగన్వాడీ కేంద్రం-37 సందర్శించి, ప్రీ స్కూల్ పిల్లలకు హ్యాండ్ వాష్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. పిల్లలకు వండిన ఆహార పదార్థాలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శశాంక్ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మార్తమ్మ, జి.శ్రీనివాసరావు, ఎఎన్‌ఎం కె.దుర్గ, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్ రాధ, ఆశా కార్యకర్తలు సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

వాగ్దానాలు నెరవేర్చి.. ప్రజలకు అండగా.. : ఆళ్ల నాని

పలుచోట్ల నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ



ఏలూరు టౌన్: ఆసరా చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు డ్వాక్రా రుణమాఫీ చేసి లక్షలాది మహిళల జీవితాల్లో వెలుగులు నింపామని ఎంఎల్ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శనివారం ఏలూరు నియోజకవర్గ పరిధిలో 3,619 స్వయం సహాయక సంఘాలలోని 33 వేల సభ్యులకు రూ.27 కోట్ల 80 లక్షల డ్వాక్రా రుణమాఫీ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు మహిళలను మోసం చేశాడన్నారు. అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళలను సభలకు తీసుకు వెళ్లి వారు చెప్పే ఉపన్యాసాలు వినడానికే పరిమితం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారన్నారు. రానున్న రోజుల్లో మరో రూ.500 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల సుస్థిరాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి : డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామనే మాట నిలబెట్టుకున్న జగన్‌కు అండగా నిలవాలని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఏలూరు వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నాల్గవ విడత చెక్కును విడుదల చేశారు. రూ.13.95 కోట్లు డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేసి జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, సానా మీనా సరస్వతి, ఎంపిటిసిలు నీలి సుమన్, షఫాయితుల్లా, సొసైటీ అధ్యక్షులు వడుపు రామారావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

భీమడోలు: వైసిపి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, సహాయ కార్యక్రమాల సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. ఆయన భీమడోలు మండలంలో శనివారం సాయంత్రం పర్యటించారు. ఆగడాల లంక కేంద్రంగా చెటున్నపాడు, లక్ష్మీపురం, కోరుకొల్లు గ్రామపంచాయతీలకు చెందిన డ్వాక్రా మహిళలకు నాల్గవ విడతగా మంజూరైన ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ, వైసిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. అంతకుముందు ఎంఎల్ఎ మెట్ట ప్రాంతమైన కోడూరుపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.20 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఆ తర్వాత రూ.6 లక్షల జెడ్‌పి నిధులతో తాగునీటి చెరువుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రేవులకు ప్రారంభోత్సవం చేశారు. దీనివల్ల రక్షిత నీటి పథకం ద్వారా నిర్ణీత సమయం తరువాత నీటి సరఫరా నిలిచినప్పటికీ స్థానికులు తమ తాగునీటి అవసరాల కోసం రేవుల సేవలను వినియోగించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనమాల రామయ్య పాల్గొన్నారు.



భీమడోలులో చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

జగనన్న కాలనీల పేరుతో మోసం

మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న కాలనీల పేరుతో పేద ప్రజలను జగన్ మోసం చేస్తున్నాడని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ముసునూరు మండలంలోని చెక్కపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షా 50 వేల నిధులను మాత్రమే ఇస్తున్న జగన్ రెడ్డి సంబంధిత కాలనీలకు, తన పేరు ఎలా పెట్టుకుంటారని ముద్దరబోయిన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసేదని ఇప్పుడు మాత్రం పనికిరాని కొండ భూములు, చెరువు భూములు వంటివి ఇస్తూ, అవి అధికార పార్టీ సానుభూతిపరులకే పంపిణీ చేస్తూ సొంత పార్టీ సానుభూతిపరులను సైతం ఈ జగన్ రెడ్డి మోసం చేస్తున్నాడనేది గుర్తించాలన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా రాయితీపై పరికరాలు రుణాలు ఇస్తే ఈ జగన్ రెడ్డి బిసిలకు 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కూడా ఇవ్వకుండా, ఛైర్మన్‌లకు కనీసం కుర్చీ కూడా లేకుండా అవమానపరిచాడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మాజీ జెడ్‌పిటిసి చిలుకూరు వెంకటేశ్వరరావు, కొల్లి గంగారం, మందలపు ధర్మరాజు, సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, సర్పంచి గద్దల సుహాసిని మోహన్రావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు తెలిపారు. శనివారం నిడమర్రులోని ప్రజాసంఘాల కార్యాలయంలో మైలవరపు నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్రలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికులుకు రూ.10 వేల వేతనం పెంచుతానని, మాట తిప్పని, మడమ తిప్పని జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. కనీసవేతన చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు కోరాడ వెంకటరమణ, తూతుకు నాగమణి, గంగాభవాని, దోసనపూడి వరలక్ష్మి, ఆరిమిల్లి చిన్న పద్మ, దొడ్డిపట్ల శ్రీలక్ష్మి ఉన్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు.. జనం అవస్థలు

ముదినేపల్లి : మండలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో కాయాల్సిన ఎండలు ఫిబ్రవరి మొదటి వారం నుంచే ప్రతాపం చూపుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో గురజ రోడ్డు సెంటర్, వై.కూడలి నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల వల్ల వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడు తున్నారు. ఫిబ్రవరి రెండో వారానికే ఎండలు ఈ విధంగా మండుతుండడంతో రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరుగుతాయని జనం ఆందోళన చెందుతున్నారు. మండలంలో 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల నమోదవ్వడంతో జనం ఉలిక్కిపడుతున్నారు.

నిరాశ.. నిర్బంధం..!

ఓవైపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వివిధ తరగతుల ప్రజల్లో నిరాశ.. ఆ హామీల అమలు కోసం నినదిస్తే నిర్బంధం. ఇదీ జిల్లావాసులు గడిచిన వారం రోజుల్లో ఎదుర్కొన్న అనుభవం. దెందులూరులో సిఎం 'సిద్ధం' సభ, రాష్ట్ర బడ్జెట్ జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేయగా.. హామీల అమలు కోసం గొంతెత్తిన ఆశా వర్కర్లపై ప్రభుత్వ దమనకాండ, నిర్బంధం అందరినీ నివ్వెరపర్చింది.

ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా అధికార పార్టీ వైసిపి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల స్థాయి 'సిద్ధం' సభ ఏలూరు శివారు దెందులూరులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ ప్రయివేటు స్థలంలో పెద్దఎత్తున నిర్వహించింది. జనసమీకరణ తదితర అంశాలు పక్కనబెడితే తమ పదవీకాలంలో చేసిన పనులన్నీ చెప్పి వాటినే ప్రచారం చేయాలని వైసిపి శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు. కనీసం సభకు కేంద్రమైన నియోజకవర్గానికి సంబంధించిన కొల్లేరు అంశంపై కనీసం నోరుమెదపలేదు. సమీపాన ఉన్న ఏలూరులో బయటపడిన అంతుచిక్కని వ్యాధి గురించి ప్రస్తావనే లేదు. వీటన్నింటితోపాటు ఈ జిల్లా పరిధిలో ఉన్న పోలవరం నిర్వాసితులకు సంబంధించి చేసిందేమిటీ.. చేయబోయేదేమిటీ అనే ఊసే కరువైంది. వాళ్లు చేసింది చెప్పుకోవడమే తప్ప పెండింగు అంశాలకు సంబంధించి జనం వైసిపి శ్రేణులను నిలదీస్తే ఏం చెప్పాలనేది సిఎం జగన్ స్పష్టత ఇవ్వకపోవడంపై వైసిపి శ్రేణుల్లోనే కొంత గందరగోళం నెలకొందని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు 'సిద్ధం' అయ్యేది ఇలాగేనా అని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఇక రాష్ట్ర బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. వైసిపి ప్రభుత్వం తన పదవీకాలంలో ప్రవేశ పెట్టిన చివరి బడ్జెట్ మధ్యంతరమే అయినా కనీసం కొన్ని హామీల అమలుకు రాబోయే కాలంలో కేటాయింపులపైనా ప్రస్తావన లేకపోవడం అందరినీ నిరాశపర్చింది. పోలవరం నిర్వాసితులు, కొల్లేరు ప్రజలకు పునరావాసం, ఉపాధి, డెల్టా ఆధునికీకరణ, వాటర్‌గ్రిడ్, ఫిషింగ్ హార్బర్ వంటి అంశాలేవీ చర్చకు రాకపోవడంపై జిల్లావాసులు పెదవివిరుస్తున్నారు.

చింతలపూడిలో 'రా.. కదలిరా' పేరిట చంద్రబాబు సభ ఆర్భాటంగా నిర్వహించగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల దెందులూరు నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. చంద్రబాబు సభ గతానికి భిన్నంగా నిర్దేశిత సమయానికి ప్రారంభం కావడంతో జనం హాజరు బాగానే ఉంది. అయితే చింతలపూడి, పోలవరం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారేగాని సభ జరిగిన ప్రాంతానికి చెందిన చింతలపూడి ఎత్తిపోతల పథకంలో నిర్వాసితులైన రైతులకు పరిహారంపై స్పష్టమైన ప్రకటన

చేయకపోవడం నిర్వాసిత రైతులను నిరాశకు గురి చేసింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనూ పరిహారం గురించి రైతులు ఆందోళన చేసిన విషయం గుర్తుకు తెచ్చుకుని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు 'దొందూ.. దొందే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని రైతులు పెదవివిరుస్తున్నారు. షర్మిల ప్రధానంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా సాగిస్తున్న ప్రసంగాలు, బిజెపి, వైసిపి ప్రభుత్వాలపై ఎక్కుపెడుతున్న విమర్శలు ఆ పార్టీకి ఓట్లు ఏ మేరకు తీసుకొస్తాయో చెప్పలేముగాని చర్చనీయాంశమవుతున్నాయని చెప్పొచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

పోలీసు శాఖ ప్రజా రక్షణకా.. పాలకుల రక్షణకా అనే చర్చ జిల్లాలో పెద్దఎత్తున సాగుతోంది. ఆ శాఖపై రాజకీయ ఒత్తిడి, ప్రభుత్వాల మౌఖిక ఆదేశాల ఒత్తిడి కొత్తేమీ కాదు. అయితే తాము గీసుకున్న లక్ష్మణరేఖ పరిధిలో పాలకులకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వారి ఆదేశాలను పాటించినా ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం నిరంతరం కృషి చేసేవారు. వైసిపి పాలనలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఏదైనా సమస్యపై ఉద్యమించేవారిని రోడ్డెక్కాక అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించడం చేసేవారు. ఈసారి అత్యంత నిరంకుశపూరితంగా ఇళ్ల వద్దే అడ్డుకుంటున్నారు. అదేదో అధికారిక కార్యక్రమానికే అనుకుంటే పొరబడినట్లే. సిద్ధం సభ పూర్తిగా రాజకీయ సభ. ఆ సభలో పాల్గొనేందుకు సిఎం జగన్ వస్తున్నారనే పేరుతో నిరసనలు తెలుపుతారనే భయంతో సిపిఎం, సిఐటియు, రైతుసంఘం, ఇతర పార్టీలు, ప్రజాసంఘాల నేతలను కార్యాలయాల్లో, ఇళ్ల వద్ద నిర్బంధించడం ఏమిటో అర్థంకాక మేధావులు, జనం సైతం ముక్కు మీద వేలేసుకున్నారు. ఇక ఆశాల చలో విజయవాడ నేపథ్యంలో పోలీసుల తీరు మరింత చర్చనీయాంశమైంది. ప్రభుత్వమే మానవత్వ విలువలు కోల్పోయిందనుకుంటుంటే పోలీసులు సైతం కనీస మానవత్వ విలువలు పాటించని పరిస్థితి ఈ సందర్భంగా కన్పించింది. నూజివీడులో సిఐ రైతుసంఘం నేతపై సాగించిన జులుం, దురుసు ప్రవర్తన పోలీసులా, అధికార పార్టీ ప్రయివేటు సైన్యమా అనే అనుమానం తలెత్తేలా చేసింది. అలాగే పలు పోలీసు స్టేషన్లు, ప్రయివేటు కళ్యాణ మండపాల్లో నిర్బంధించిన ఆశాలకు మధ్యాహ్నం సమయంలో కనీసం భోజనం అందించకపోవడం, మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులే ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులే భక్షకులుగా మారితే ఇక మహిళలకు సమాజంలో ఆకతాయిలు, దుండగుల నుంచి ఎదురయ్యే సమస్యలేమిటో రెండు జిల్లాల్లో ఉన్న పోలీసు శాఖలో ఉన్నతాధికారిణులైన మహిళలకు తెలియదా అనే చర్చ సాగుతోంది. పైగా పేర్లు చెప్పకపోతే భోజనం చేయడం ఆపాలంటూ నూజివీడు సిఐ రంకెలు దేనికి తార్కాణమో చెప్పాలి. పోలీసులపై ఒత్తిడి ఉండొచ్చు. అయితే ఈ తరహా ప్రవర్తన ఎన్నడూ మాత్రం జిల్లావాసులు చవిచూడలేదు. ఇప్పటికైనా సదరు అధికారిపై చర్యలు చేపట్టకపోతే పోలీసు శాఖ ప్రతిష్ట మసకబారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్


తహశీల్దార్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఎక్కువ కాలం పనిచేసి ప్రజాధారణ పొందిన డైనమిక్ లేడీ తహశీల్దార్ అని పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ కొనియాడారు. మండలంలో గత నాలుగేళ్లుగా పనిచేసిన తహశీల్దార్ బి.సుమతికి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది శుక్రవారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో నిర్వాసితుల సమస్యలు, పట్టిసీమ, మహాశివరాత్రి ఉత్సవాలు, వరదలు, భూ సమస్యలు, ఇతర అన్ని సమస్యలను పరిష్కరించి ఆడదంటే అబల కాదు.. ఆదిశక్తి అని నిరూపించారన్నారు. రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు స్ఫూర్తిదాయకంగా, ఆదర్శంగా నిలిచిన తహశీల్దార్ మళ్లీ తమ ప్రాంతంలోనే తహసిల్దారుగా రావాలని లేదా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా ప్రమోషన్ పొంది రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, విఆర్ఒలు, విఆర్ఎలు, అటెండర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పేదలకు వైద్య సహాయంలో ఎక్కడా లోటు లేకుండా మెరుగైన వైద్యం అదించడమే లక్ష్యమని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. నూజివీడు ఎంఎల్ఎ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 14 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.16 లక్షల చెక్కులను ఎంఎల్ఎ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పేదల పట్ల అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ

'విద్యార్థి దశలోనే అవగాహన పెరగాలి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రోడ్డుపై నడిచే సమయంలో విద్యార్థులు ముందుగా ప్రమాదాలను గుర్తించి క్షేమంగా గమ్యస్థానాలను చేరుకోవాలని, విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ పవన్ కుమార్ సూచించారు. నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ జెడ్‌పి హైస్కూల్‌లో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని హోటల్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ సాదిక్ తెలిపిన వివరాల ప్రకారం నేపాల్ దేశానికి చెందిన మిత్ దౌర్జా తామన్(29) వలస జీవన విధానంలో జిల్లాలోని ఏలూరు నగరానికి జీవనోపాధి కోసం చేరుకున్నాడు. నగరంలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని గుమ్మడి హోటల్‌లో మాస్టర్ చెఫ్ వద్ద సహాయకునిగా పనిచేస్తున్నాడు. ఇతను గత రెండు నెలలుగా ఈ హోటల్లో పనిచేస్తున్నాడని తోటి పనివారు తెలియజేస్తున్నారు. గత కొద్ది రోజులుగా దిగులుగా ఉంటున్నాడని తెలిపారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కాని శుక్రవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన అతను శనివారం ఉదయం కిటికీ ఊచకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం లేచి చూసిన అతని స్నేహితులు హోటల్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరకట్న వేధింపులతో మహిళ మృతి చెందిన కేసులో నలుగురిని ఏలూరు డిఎస్‌పి పి.శ్రీనివాసులు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని ఊటుకూరు పంచాయతీ శివారు నారాయణపురంకు చెందిన కోనదుర్గ భవాని(22) భర్త, అత్తమామలు, బావ పెట్టే వరకట్న వేధింపులు భరించలేక ఈనెల 2వ తేదీన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కుమార్తె మరణానికి అత్తమామలతో పాటు భర్త కారణమని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు విచారణ చేపట్టారు. దుర్గ భవాని మరణానికి కారణమైన భర్త కోన మాధవ నాగరాజు, మావ వీరాంజనేయులు, అత్త నాంచారమ్మ, బావ సుబ్రహ్మణ్యంలను అరెస్ట్ చేసి కైకలూరు కోర్టుకు హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన ముసునూరు మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన పాలవెల్లి జగన్నాథరావు కుమారుడు పాలవెల్లి శ్రీనివాసరావు(47) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. ఇతని భార్య తన పుట్టింటికి వెళ్లగా, మరునాడు భర్త వంట గదిలో చీరతో ఊరివేసుకున్నాడని మామయ్య తెలపటంతో వెంటనే వీరకుమారి బయల్దేరి రాగా అప్పటికే మృతి చెందాడు. భార్య వీరకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముసునూరు ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అప్పలరాజు గూడెం పంచాయతీలోని పాకలగూడెం గ్రామ శివారు ఎర్ర కాలువ తూర్పు వాగు వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలివస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేశామన్నారు. నేర స్థలంలో ముద్దాయిని పట్టుకొని ఒక యూనిట్ ఇసుకతో నిండి ఉన్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం, సారా విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలోని సిద్ధార్థ నగర్ తండాలో 44 మద్యం బాటిళ్లు, 40 లీటర్ల నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి సెల్ ఫోను, బైకు తీసుకున్నట్లు ఎస్ఇబి సిఐ వెంకటరమణ తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు 21 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ శనివారం తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ముసునూరు: నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.78,500 నగదు, ఒక కారు అదుపులోకి తీసుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. శనివారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై తమ సిబ్బందితో దాడి చేసి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్న ఎస్ఐ వాసు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందేలు, పేకాటలే కాదు సారాపై కూడా ఎస్ఐ దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

16న గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలి

రైతాంగ, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఈనెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కెవి.రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు బి.రాంబాబు, ఎఐకెఎంఎస్ బి.ఏసుపాదం పిలుపునిచ్చారు. శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు, ఎఐటియుసి నాయకులు రమణరాజు అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా లిఖితపూర్వకంగా హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా దేశ రైతాంగాన్ని, ప్రజలను మోడీ ప్రభుత్వం మోసగించిందన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించి, రోజుకి కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పాలసీ అమలు చేస్తూ మౌలిక వసతులను లీజు పేరుతో ప్రయివేటీకరిస్తుందని చెప్పారు. మతతత్వ విధానాలతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్-మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. 16వ తేదీ ఉదయం 11 గంటలకు జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం రూట్‌లోని పాత పంచాయతీ ఆఫీస్ నుంచి బస్టాండ్ వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రదర్శన ఉంటుందని, ఈ ర్యాలీలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని, కేంద్ర ప్రభుత్వ ప్రజా, వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అందుగుల ప్రభాకర్ రావు, ఎఐటియుసి సి.విగ్నేష్. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, ఆటో యూనియన్ పి.సత్తిబాబు, స్టాలిన్, కె.సుబ్బారావు, పి.చంటి, పిడిఎస్‌యు పి.రమేష్ పాల్గొని మాట్లాడారు.

జంగారెడ్డిగూడెం టౌన్: సంయుక్త సమావేశంలో నాయకులు

ఏలూరు అర్బన్: ఈనెల 16వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు ఐఎఫ్‌టియు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. వైఎంహెచ్ఎ హాల్ నుంచి మెయిన్ బజార్, చందన బ్రదర్స్, బిర్లా భవన్ సెంటర్ మీదుగా ఎన్ఎస్ మార్కెట్ వరకు ఈ ప్రదర్శన జరిగింది. అనంతరం జరిగిన సభలో సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ఈనెల 16న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

రూ.90 లక్షలతో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని గుర్వాయిపాలెంలో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ వైద్య, ఆరోగ్య కేంద్ర భవనాలను కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామ ప్రజల అవసరాలు తీర్చేందుకు మూడు నూతన భవనాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు పోసిన చెంచు రామారావు, సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యన్నారాయణ, ఉపసర్పంచి నల్లూరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో వైసిపికి బుద్ధి చెప్పాలి

టిడిపి ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి

కొయ్యలగూడెం: ఆశ వర్కర్లతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో బుద్ధి చెప్పి గద్దె దింపాలని టిడిపి ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని ఆమె నివాసం వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ అంగన్వాడీలు, ఆశవర్కర్లు, పారిశుధ్య కార్మికులతో ఆటలాడుకుంటుందని వైసిపిని విమర్శించారు. ఇటువంటి రాక్షస పాలన నడిపిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రానున్న రోజుల్లో సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించి, చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్ర దశ, దిశ మార్చుకోవాల్సిందిగా ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉంటుందని ఆమె రాష్ట్ర ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమా, బి.దేవి, ఝాన్సీ, జయశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఎంఇఒ సుబ్బారావు

ముసునూరు: విద్యార్థులు 10వ తరగతిలో మంచి మార్కులతో పాస్ అయితే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎంఇఒ సుబ్బారావు తెలిపారు. స్థానిక భారతి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 10వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కొండేటి శౌరి మాట్లాడుతూ ఇప్పటి నుంచి మంచి ప్రణాళిక వేసుకుని చదివినట్లయితే పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవచ్చని చెప్పారు. అనంతరం భారతి స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు వారే నిర్మాతలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యాక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ పాఠశాల తనిఖీ

నూజివీడు రూరల్: మండలంలోని ఎంఎన్ పాలెం గ్రామంలోని ఎంపి ఎలిమెంటరీ పాఠశాలను నూజివీడు పట్టణ జడ్‌పి గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశంతో ఎలిమెంటరీ పాఠశాలల్లో పలు రికార్డులు పరిశీలించి, హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, విద్యార్థుల ప్రగతిపై తనిఖీలు చేసి నివేదికను అందించనున్నట్లు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ సంక్షేమమే టిడిపి ధ్యేయం

కలిదిండి: అగ్నికుల క్షత్రియ సంక్షేమమే టిడిపి ధ్యేయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. మండలంలోని ఉప్పుటేరు తీరప్రాంత గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దుంపలకోడుదిబ్బలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ నెం.217ను వెంటనే రద్దు చేసి అగ్నికుల క్షత్రియ మత్స్యకారులను ఆదుకోవాలన్నారు. టిడిపి హయాంలో అగ్నికుల క్షత్రియులకు సబ్సిడీపై వలలు, పడవలు, బొలెరోలు, మోటార్ సైకిళ్లు అందించిందన్నారు. గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేసి విద్యను పెద్ద ఎత్తున ప్రోత్సహించిన ఘనత టిడిపిదేనని రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌ను పెంపొందించుకోవాలి

ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్: విద్య అనేది సైన్స్ వైపు తీసుకెళ్లాలి కాని, ఈ ప్రభుత్వాలు మూఢాచారాల వైపు తీసుకెళ్తున్నాయని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఏలూరులోని స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు రెండో రోజు ముగిసాయి. శనివారం ఉదయం క్లాస్ ప్రారంభంలో ఎ.రవి మాట్లాడుతూ సమాజంలో దొంగ బాబాలు మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, మూఢత్వం పేరుతో ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఒక్క శాస్త్రవేత్త పోస్ట్ కూడా భర్తీ చేయలేదన్నారు. సమాజం మారాలని ఎస్ఎఫ్ఐ ఎంతో కృషి చేస్తుందన్నారు. నూతన విద్యా విధానంలో సైంటిఫిక్‌గా ఏమీ లేదని అంత మోడల్ విశ్వాసంపైనే ఉందన్నారు. విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందించాల్సింది పోయి మూఢత్వాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో మళ్లీ 70 సంవత్సరాల వెనక్కి వెళ్తామన్నారు. దీన్ని అధిగమించడానికి విద్యార్థుల్లో సైన్స్‌పరంగా ఆలోచించే భావాన్ని నింపాలని ఎస్ఎఫ్ఐ అందుకు తోడ్పడాలని పేర్కొన్నారు. అనంతరం ముగింపు క్లాస్‌గా ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా అధ్యక్షులు పి.రామకృష్ణ మాట్లాడుతూ యువత రాజకీయాలకు రావాలని, యువత వల్లే దేశం మారుతుందని అన్నారు. కాని ఈ ప్రభుత్వాలు యువతని రాజకీయాల్లో రానీకుండా అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారన్నారు. 1990 వరకు యూనివర్సిటీలో ఎన్నికలు ఉన్నాయని, 1990లోనే ఆ ఎన్నికలను రద్దు చేశారన్నారు. ఈ ప్రభుత్వాలు యువత ఆలోచనతో మొదలుపెడితే రాజకీయ నాయకులకు సంపాదన ఉండదని, కుటుంబ రాజకీయాలు ఉండవని భయపడి యూనివర్సిటీల్లో ఎన్నికలు ఆపేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, క్రాంతి పాల్గొన్నారు.

ప్రజలకు భరోసాగా టిడిపి 'శంఖారావం'

దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - పెదపాడు

నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టిడిపి 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం ఏపూరులో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ పథకాల విశిష్టతను ప్రజలకు వివరించారు. తమ గ్రామానికి విచ్చేసిన చింతమనేనికి పూల జల్లులు, మహిళల మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. స్థానిక హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్‌లో ఉన్న వాణిజ్య సముదాయాల్లోని ప్రతి దుకాణానికి వెళ్లిన చింతమనేని, రాజధాని లేని మన రాష్ట్రంలో అభివృద్ధి కూడా లేకపోవడం వల్ల వ్యాపార రంగాలు అన్ని పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జగన్ అవివేక పాలన వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వ్యాపారస్తులకు వివరించారు. జగన్ అరాచక పాలనకు వ్యతిరేకంగా నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం చేపట్టనున్నారని, ఇందులో భాగంగా రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుత్తా అనిల్ పాల్గొన్నారు.


చింతలపూడి: మాట్లాడుతున్న జగ్గవరపు ముత్తారెడ్డి

చింతలపూడి: నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగంతో యువత పడుతున్న ఇబ్బందులపై ప్రజలకు భరోసా కల్పించేలా బాబుకు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ సాగే శంఖారావ యాత్రకు ప్రజలంతా అండగా ఉండాలని జగ్గవరపు ముత్తారెడ్డి కోరారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో చేపట్టిన శంఖారావం ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రగుంటపల్లి గ్రామంలో టిడిపి సిద్ధాంతాలు నచ్చి 50 మంది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరగా వారికి పసుపు కండువా మెడలో వేసి రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా, పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఆది జగన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

ప్రజాశక్తి - చాట్రాయి

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య తెలిపారు. మండలకేంద్రంలో ఈనెల 11న జరగబోయే ప్రజాసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామకోటయ్యను ప్రజాశక్తి పలకరించగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీపై ప్రజలకు, నాయకులకు వ్యతిరేకత ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలో గ్రూపు తగాదాలు ఉన్నాయని, ప్రజలకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో నూజివీడు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా, ఎంఎల్ఏగా పోటీ చేస్తున్న నాకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. ఎంఎల్ఏగా గెలుపొందుతాననే నమ్మకం ఉందని, నియోజవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయగల శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని అన్నారు. మండలంలో ఈనెల 11న జరిగే ప్రజాసభకు పదివేల మందితో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల నుంచి నాకు మద్దతు ఉందని, బహిరంగ సభ విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామకోటయ్య

'రహదారి పనులు పూర్తి చేసేందుకు చర్యలు'

మండవల్లి: రహదారి విస్తరణ పనుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, రహదారి అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానని ఎన్‌హెచ్ డి.సత్యనారాయణ స్పష్టం చేశారు. మండవల్లిలో నిలిచిపోయిన రహదారి విస్తరణ, డ్రయినేజీ నిర్మాణం పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు రహదారి నిర్మాణం పనుల వల్ల ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గుత్తేదారుడు మండవల్లిలో డ్రయినేజీ నిర్మాణం పనులను క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా నిర్మించాడన్నారు. అంతే కాకుండా వరుస క్రమంలో పూర్తి చేయకుండా గత నాలుగు నెలల క్రితం డ్రయినేజీ నిర్మాణం నిలుపుదల చేసి వెళ్లిపోయాడని అన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ డ్రయినేజీ నిర్మాణ పనులు నిర్వహించే క్రమంలో ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమేనన్నారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రయినేజీ నిర్మించే క్రమంలో గుత్తేదారుడికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రైతుల మోటార్లకు మీటర్ల బిగింపు దుర్మార్గం

చింతలపూడి: రైతుల మోటార్లకు జగన్‌రెడ్డి ప్రభుత్వం మీటర్లు బిగించడం అత్యంత దారుణమని చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. చింతలపూడి పట్టణంలో శనివారం రైతులకు మద్దతుగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ మారుమూడి థామస్ మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అవ్వడమే కాకుండా, తన బంధువుల సంస్థ శిరిడి సాయి ఎలక్ట్రికల్‌కు కాంట్రాక్ట్‌ను ఇచ్చి రూ.వేల కోట్లు లబ్ధి చేకూర్చే విధంగా జగన్‌రెడ్డి మూర్ఖత్వపు నిర్ణయాలు ఉన్నాయని అన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్‌ను అందిస్తామని ఎన్నికల్లో జగన్ రెడ్డి మాట ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మడమ తిప్పాడన్నారు. ఏ సమయంలో కరెంటు వస్తుందో, పోతుందో తెలియక రైతులు సతమతమవుతున్నారన్నారు. వైవి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు తమ జేబులు నింపుకోవడానికి శిరిడీ ఎలక్ట్రికల్ సంస్థతో కుమ్మక్కయ్యారన్నారు. రాబోయే రోజుల్లో వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుట్టాయగూడెంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పొరుగు సేవల ఉద్యోగాలకు(అవుట్ సోర్సింగ్) ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడునని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ఉద్యోగ ప్రకటన ద్వారా రికార్డ్ అసిస్టెంట్(విద్యార్హత ఇంటర్మీడియట్ పాస్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి), ఆఫీస్ సబార్డినేట్(విద్యార్హత ఎస్ఎస్‌సి పాస్) ఖాళీలను ఆప్కాస్ ద్వారా నియమిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఆసక్తిగల 18 సంవత్సరాల నిండిన వారు తమ అప్లికేషన్‌లను ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుట్టాయగూడెంలో సమర్పించాలని తెలియజేశారు.

వడ్లపట్ల బూత్ అధికారి తొలగింపు : తహశీల్దార్

ప్రజాశక్తి - భీమడోలు

ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వడ్లపట్ల బూత్ అధికారిని ఎన్నికల విధుల నుంచి తొలగించినట్లు భీమడోలు తహశీల్దార్ జి.వరహాలయ్య తెలిపారు. ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు ఏర్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై విచారణ జరిపి విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన బూత్ అధికారిని తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గూడూరి శ్రీనివాసు, తండ్రి: వెంకట సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. తాళ్ళపాలెం, దేవ నుండి పెనుగొండ వస్తుండగా పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **V7833241** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
గూడూరి శ్రీనివాసు
తండ్రి: రమ వెంకట సత్యనారాయణ
డోర్ నంబర్: 4-7, తాళ్ళపాలెం
దేవ, పెనుగొండ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 8463981819

IN THE COURT OF THE HON'BLE VII ADDL. DISTRICT JUDGE, ELURU
O.S.No.10/2021
Between:
Sri Kommana Lakshmi Narsu ...Plaintiff
And
Smt.Gedela Padmavathi and 3 Others ...Defendants

పై నంబరు దావాలో D1.అయిన Smt. Gedela Padmavathi, W/o.Venkata Koteswara Rao, R/o.D.No.20E-13-2, 42nd Division, Bommivari Street, Eluru, W.G. Dist., D2 అయిన Sri. Voruganti Venkata Siva Rama Krishna, S/o.Venkataramaiah, R/o.D.No.3D-9-3, Western Street, Eluru, W.G.Dist. అను వారికి నోటీసుల అమలు కొరకు ది.13.02.24 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు శ్రీకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

E.SRINIVAS BABU
Advocate, Road No.2, NGO Colony,
ఏలూరు, Ameenapet, Eluru, W.G.Dist.
తేది.07-01-2024 Ph: 08812-239498

In the Court of the 1st Additional Junior Civil Judge Cum - 1st Additional Judicial Magistrate of 1st Class, Tadepalligudem
I.A. No. 190/2021 in O.S. No. 491/2021
In Between:
Yempalla Suhasini ***...Plaintiff/ Petitioner***
AND
Marapatla Jyothi and another ***...Defendants/ Respondents***
Respondent No-1: Smt. Marapatla Jyothi, W/o. (late) Suneel Kanth, Female, age 40 yrs, R/o. Opp. R.C.M. Church, Chinanindrakolanu Village, Nidamarru Mandal.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు, మీపై దావా దాఖలు చేసినప్పటి నుండి 1వ ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు నోటీసు పంపినప్పటికి మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు నోటీసులు అమలు నిమిత్తం **ది. 28-02-2024వ తేదీ వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం 10.30 ని॥ల** లగాయితు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపగలరు. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

INJETI RAJESH, Advocate
Tadepalligudem, Cell: 9912017174

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 314/21
Between:
Vijaya Bank, Tanuku, Now Bank of Baroda, Tanuku, Rep. by its Manager -వాది
మరియు
1. వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డో.నెం. 5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సత్యవతి, W/o. ప్రసాద్, డో.నెం. 5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీ ఇద్దరికి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము **ది. 14-02-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున సదరు తేదీన మీరిరువురు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానింపబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

తణుకు ఓ.ఎన్.కృష్ణ, అడ్వకేట్
10-2-24 తణుకు, సెల్:9848199440